# మళ్ళీ బ్రతికిన సూరి

సూరి అనబడే సూర్యనారాయణకు నాతూమల్ దుకాణం అంటే మహా ఇష్టం.

ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే నాతూమల్ దుకాణం కుడివైపున వున్న 'షో కేస్' అంటే ఇష్టం అని చెప్పాలి.

అంటే సూర్యనారాయణ లక్ష్మీకటాక్షానికి పాత్రుడయినవాడనీ, దుకాణములో ఎడాపెడా వస్తువులు కొంటాడనీ, అలా కొన్నేళ్ళతరబడి కొనగా కొనగా అతగాడికీ ఆ దుకాణానికీ మధ్య ఒక అవినాభావసంబంధం ఏర్పడిందనీ మీ రనుకుంటే అదిమాత్రం బొత్తిగా సరికాదు.

ఎం–2 (మిసలేనియస్–2) అని ఆఫీసులో పిలవబడే గుమాస్తా సూరీడికి ముప్పైరోజులకూ కలిపి సర్కారువారు ఇచ్చేది వందమీద అరువది రూప్యంబులు.

ఇహ నాతూమల్ దుకాణమో? నగరంలోకెల్లా అతి గొప్పదైన దుకాణం. ప్రధానమంత్రులూ, రాయబారులూ, విదేశాలనాయకుల భార్యామణులూ, ఐ. సీ. ఎస్సుల పెళ్ళాలూ, బొంబాయి సినిమాతారలూ–రోజూ వచ్చి వెళ్తుండేదుకాణం. దంతపుబొమ్మల మొదలు జరీచీరలవరకు, వెండి పాత్రల మొదలు వెదురుబుట్టలవరకు, ఎనిమిదడుగుల ఎత్తు ఏనుగుల మొదలు ఫిల్గ్రీ నగలవరకు—చేతి పనితనం విలసిల్లే వస్తువులనమ్మే

దుకాణం. కాశ్మీరు శాలువలు, మీర్జాపూరు తివాసీలు, కొండపల్లి బొమ్మలు, మద్రాసు నటరాజులూ, బంకూరా గుర్రాలూ, కోణార్క శిల్ప ప్రతి రూపాలు,చీరలు, నగలు, పటాలు, సంచులు, ఓహ్ ఒకటేమిటి,ఎన్నెన్నో, వింతవింత వస్తువులతో ప్రతీ అంగుళమూ విరాజిల్లే దుకాణము. దేశ విదేశాలలో తమ సరుకులనమ్మి ఖ్యాతి నార్జించిన దుకాణము. ప్రపంచంలో ఏమూల అంతర్జాతీయ ప్రదర్శనలో భారతదేశం పాల్గొన్నా తప్పక పాల్గొనేది నాతూమల్ దుకాణము.

మరి ఆ దుకాణం అనబడే హస్తికీ ఈ సూరి అనే మశకానికీగల అనుబంధం ఏమిటి ?

నాతూమల్ దుకాణంలో వస్తువులన్నిటినీ రోజూ తుడిచి శుభ్రంగా వుంచే గుర్నాంసింగ్‌కు జీతంరోజున సూరికన్న అరురూపాయలు ఎక్కువ వస్తాయి.

మరి అట్లాంటి సూరికి, ఈ జీవితంలో మంచికోరికలు కలగడానికి అర్హతలేని సూరికి, పిచ్చిముండాకొడుకు కాకపోతే ఇంత పెద్దదుకాణం మీద మమకారంఏమిటి నాబొంద అనుకోవచ్చు మీరు....

అక్కడే వస్తుందొక విచిత్రం....ఎంత సూరిగాడయినా కలలు కనడానికి కిరాయిలేదుగా....

అందుకనీ

ఎలిజబెత్ టేలర్‌తో ఫ్రెంచి రివీరాలో విలాసయాత్ర, రాష్ట్రపతితో విందుభోజనం, పార్లమెంటులో అటు ప్రభుత్వమూ-ఇటు ప్రతిపక్షమూ అదిరిపడేట్లు ప్రసంగించడం. ప్రపంచంలోని ఆరేడువందల భాషలలోకి తర్జుమాచేసి పారేయదగిన గ్రంథరాజాన్ని రచించడం. ఎవిమిది వాద్యాలమీద అవలీలగా కర్నాటక హిందూస్తానీ బాణీలలోనేగాక బీతోవెన్ బాక్‌ల సంగీతముకూడా వాయించేసి తన దివ్యసంగీతాన్ని విని ఆనందాబ్ధిలో మునిగితేలిన ఐక్యరాజ్యసమితి సభ్యులందరూ హర్షధ్వానాలు

చేస్తుంటే– "అబ్బే దీన్లో ఏముందండీ...." అన్నట్లుగా తలవూపడం, ఎని మిది ఓవర్స్‌లో పన్నెండుపరుగులనిచ్చి వెస్టిండీస్‌జట్టును పూర్తిగా బౌల్ చేసిపారేసి, అదే సాయంత్రం డోవర్‌చేరి ఇంగ్లీషు ఛానెల్‌ఈదేసి, అవతల ఫ్రెంచితీరాన పత్రికలవారితో గోష్ఠి జరపడం–

—వంటి పనులన్నిటినీ సూరి, సూరివంటి శతకోటి సూరిగాళ్ళు రోజూ కలల్లో చేసేస్తూ వుంటారు.

దయామయుడయిన ఆ దేవుడుచేసిన ఈ స్వప్నాల ఏర్పాటు పుణ్యమా అని సూర్యానారాయణరావు పంతులుగారి అయిదెకరాల తోట పచ్చదనంమధ్య,మంచి ముత్తెంలా మెరిసేభవనంలోని ముందుగదివుందే– దాన్నిచూసి,దేవేంద్రుడే అసూయపడతాడు. పాదాలను మెత్తగా పలకరించే తివాసీలు పరిచిన ఆ గదిలో ఎటుచూసినా అందాలునిండిన కళాఖండాలు, ఆ మూల బీరువాలో పంతులుగారు అపుడపుడు విదేశాలకు వెళ్ళినపుడు సేకరించుకువచ్చిన అపూర్వమైన వస్తువులు–వీటితో ఆ గది అనన్యముగా అలరారుతూ వుంటుంది.

....అయితే సూర్యనారాయణ నాతూమల్ దుకాణం కుడివైపున వున్న షోకేసుని ప్రేమించడం అన్నదిమాత్రం పచ్చి నిజం. అందులో అబద్ధము ఏమీలేదు: అది కలమాత్రంకాదు.

ఎందుకయ్యా మరి ఈ ఆసామికి ఆషోకేసుమీద మోజు అని అడిగితే–

ఆ కేసులోని....ఆకాశం రంగుతివాసీ మధ్యగా వెలుగుతూందే ఒక పళ్ళెంవంటిది, ఆ వెండిపళ్ళెంలోని ప్రతిమిల్లిమీటరూ శిల్ప విన్నాణంతో శోభిల్లుతుంటే ఆ శోభకు కేంద్రంగా చుక్కల్లో చంద్రుడిలా భువన మోహనుడైన శ్రీకృష్ణుడు వేణువునూదుతున్న శిల్పంవుందే, ఆ కృష్ణుడి పెదవులమీద దోబూచులాడే లేత చిరునవ్వుందే అది–సూరి అనే తుప్పు పట్టిన మేకుని అయస్కాంతంలా లాగేసింది. ఆ రజితఫలకం అంటే

అతడికి పంచప్రాణాలూననడం అతిశయమైన యుక్తికానేకాదు. రోజూ తాను ఇంటినుండి ఆఫీసుకు, అక్కడినుండి ఇంటికి నడిచివెళ్ళవలసిన దారిమీదే ఆ నాతూమల్ అనే మహావీయుడు దుకాణం పెట్టడంవలన, అంతటితో ఆగక ఆ షోకేసొకటి ఏర్పాటుచేసి అందులో తను మనసారా ప్రేమించి ఆరాధించదగినంత సౌందర్యాన్ని, ఆరజితఫలక రూపేణా అమర్చడంవలన-సూరి అనే, 100-3-124-4-160-5-200 స్కేలుమీద పాకే గొంగళిపురుగు కళామయప్రపంచంలోకి కనీసం చూపులనయినా పంపడానికి అవకాశం ఏర్పడింది.

ఇవ్విధంబుగా సూర్యనారాయణ (ఉరఫ్) సూరికి మూడేళ్ళనుండీ రోజూ రెండుపూటలా, ఏది తప్పినా నాతూమల్ దుకాణంలోని ఆ వెండి ఫలకంఎదుట ఓ ఐదునిముషాలు నిల్చుని చూచివెళ్ళడంమాత్రం తప్పేది కాదు. సూర్యనారాయణరావు పంతులుగారి స్వప్నసౌధంలోని డ్రాయింగ్ రూములో అన్నిటికన్న మిన్నయైన ఆకర్షణ ఆ కృష్ణుడున్న వెండి ఫలకమే....

ఒకసారి బరితెగించి ఆ దుకాణంలోపలికి అడుగుపెట్టిన సూరికి – ఆ దుకాణం పూర్తిగా ఎయిర్‌కండిషన్డ్‌దే ఐనా-మహావేడిగా దుర్భరంగా వుండింది. ఇస్త్రీ మడతలమధ్య రెక్కలపురుగులా, పూలరాసులమధ్య చింతపండుపొట్లం కాగితంలా, పాలలో నలుసులా, తేనెలో రాయిలా వున్నాను తాను అన్పించింది.

సూరి శక్తినంతా కూడగట్టుకొని "అదిగో! ఆ షోకేసులోవుండే ఆ వెండిఫలకం, దానిధర?" అని అడగగా, ఆ షాపులోవుండే ఎనిమిది మంది జవ్వనులలో ఒక్కతె-"డ్రైవర్‌ని పంపకపోతే మీ అమ్మగారే రాకూడదూ లోపలికి-" అనబోయి ఆ మాట అనక, వెటకారంగా, ఎగతాళిగా, వ్యంగ్యంగా, జాలిగా ఓపావు చిరునవ్వునవ్వి, తనజడముడిపిన్నును

సుతారంగా ఎడమచేతివేలితో సర్దుకుంటూ— "వేయిన్ని నాలుగువందలు" అంది.

ఆ మాటవిన్న సూరి మూర్ఛపోయి లేచాడు; "ఎంత?" అన్నాడు కాస్త స్పష్టంగా కనుక్కుందామని:-తను విన్నదానిలో పొరబాటుందేమో నని; తాను ఆ ఫలకాన్ని ఈ క్షణాన కొనడానికి సిద్ధంగావున్నానని ఐతే ధరదగ్గరే కాస్త అభిప్రాయభేదం అన్నట్లుగా ధ్వనిస్తూ.

ఆ వగలాడి, వగలొలుక సిగ నెగదువ్వుకుంటూ— "వెయ్యిన్ని నాలుగువందలు....పధ్నాలుగు వందలు—వన్ థౌజండ్ అండ్ ఫోర్ హండ్రడ్ రుపీస్" అని, పెద్దజోకు విసురుతున్నట్లుగా చివర "ఓన్లీ" అని నవ్వింది.

ఆ విసురుకు విలవిల్లాడిన సూరి ఈ క్షణాన తన పాదాలక్రింద భూమి విచ్చుకొని ఆనాడు సీతమ్మతల్లిలా తాను దానిలోకి క్రుంగిపోతే ఎంత బాగుండును అనుకుని, అవమానంతో దహింపబడుతూ ప్రతి అడుగూ ఒకమైలుగా నడిచి బయటకువచ్చాడు.

ఆ నాటినుండి ఆ వెండిఫలకం అంటే సూరికి ఆశ, ప్రేమ, ఇష్టం, ఆకర్షణ—ఇవేగాక గౌరవంకూడా ఏర్పడింది. రేసులో తనకి ట్రెబుల్ వస్తుందా, రాఫిల్ లక్షపదివేలూ తనదవుతుందా, లేక సినిమాల్లోవలె ఏ హీరోయినో తన్నువలచి పెళ్ళాడేస్తుందా— ఎట్లా, ఎట్లా తాను దానిని కొనడం అని సూరి మథనపడిన క్షణాలు లక్షలు లక్ష లున్నాయి.

కొన్నా కొనకపోయినా ఆ కృష్ణుడిని, ఆ వెండిఫలకాన్ని చూస్తున్నంతసేపూ సూరిమనసు హాయిగా, నిశ్చలంగా, ఆనందంగా, పాలకడలిమధ్య ఆదిశేషుడిపై పవళించిన మహావిష్ణువులా వుండేది. ఆ కాస్తసేపూ అతడు మరోలోకానికి దేనికో వెళ్ళేవాడు. తన స్థితిగతుల మరిచి అదోవిధమైన సమాధిలోకి వెళ్ళిపోయేవాడు.

ఇంత పొలకడలిమధ్యా విషపుబొట్టులాటిభయం ఒకటి వచ్చేది అపుడపుడు.

ఆ వెండిఫలకాన్ని, తన జీవితానికి దిక్సూచిలావున్న దానిని, తన మనస్సనే ఎడారికి ఒయాసిస్సులావున్న ఆ దానిని—ఎవరయినా, ఏనాడయినా కొనివేస్తేనో ?

ఆ ఆలోచన వచ్చినపుడెల్లా నిలువెల్లా భయముతో వణికిపోయే వాడు సూరి.

ప్రతిరోజూ ఆఫీసుకు వెళ్తూనో, ఇంటికి వస్తూనో....ఆ దుకాణం దగ్గరకురాగానే కళ్లు మూసుకుని—"భగవాన్....నాకు ప్రియాతిప్రియమైన ఆ వెండిఫలకం అక్కడే క్షేమంగా, సురక్షితంగా, భద్రంగావుండేటట్లు అనుగ్రహించు" అని ప్రార్థించి మరీ ముందడుగు వేసేవాడు. తొలిరాత్రి భర్తను చేరుతున్న వధువులా— డైరెక్టరు వారిగదిలోకి వెళ్తున్న డెయిలీ వేజెస్‌బాయ్‌లా—మినిస్టరువారి భవనంలోకిమియర్ ఓటర్‌లా—అడుగులువేస్తూ వెళ్లి ఆ షోకేస్‌ఎదుట నిలబడి అక్కడ తనప్రాణం కుశలంగావుండడం చూచి పరమానందభరితుడయ్యేవాడు: దేవుడికి కృతజ్ఞత అర్పించేవాడు.

ఒక సాయంకాలం మామూలుగా అతడు ఆ షోకేసుఎదుట నిలబడి తన లోకంలో తాను విహరిస్తున్న క్షణంలో కర్కశమైన అపశ్రుతి ఒకటి వినిపించింది.

"అదే....దానిధర ఎంత?" అని అడుగుతూంది—ఒక కొవ్వెక్కిన ఒళ్ళుగలఆడది. ఆబిడ్డ వెనకగా డ్రైవరూ, ఆ ప్రక్కనే ఆమె మొగుడు కాబోలు నిల్చునివున్నారు. ఆ మగవాళ్లిద్దరి చేతులనిండా కరకరలాడే కాగితాలపొట్లాలున్నాయి....వీధిలో నిల్చున్నవారి ఓడలాటి పల్లటి కారులోంచి బాబ్డ్ తలనుబయటకుసాచి వాళ్ల పదహారేళ్లమ్మాయి—"మమ్మీ! కమాన్!" అని బోనులోవున్న వింతజంతువులా పదే పదే అదే పనిగా అరుస్తూంది.

ఆ కొవ్వెక్కిన వేళ్ళు 'తన' వెండిఫలకంవైపు చూపించడం గమనించిన సూరిగుండెలో గునపాలు దిగాయి.

నాతూమల్ దుకాణపుమనిషి, వాడి సిగతరగ, ఎంతో ఉషారుగా కేసులోంచి ఆ ఫలకాన్నితీసి ఆవిడకిచ్చాడు. ఆ ధూర్తురాలు అమూల్యమైన ఆ వస్తువును మహామోటుగా కుక్కపిల్లనో కోడిపెట్టనో చూచినట్లు ముందు వెనకలుచూసి, తిరగేసి, ప్రక్కకుతిప్పి చూస్తుంటే-తన్ను స్తంభానికి కట్టేసి తనఎదుటే భార్యశీలం కలుషితంచేయబడుతున్న ఘోర దృశ్యాన్ని చూస్తున్న భర్తలా-వుంది సూరి మనసు.

ఆ క్షణాన ఆ తాటకికి హిస్టీరియా ఫిట్స్ రావాలి.... లేదా వాళ్ళమ్మాయిమెడ ఆ కారు కిటికీలో ఇరుక్కుపోవాలి.... లేదా ఆ మొగుడు వెధవ వున్నాడే వాడిపర్సును అయిదునిముషాలక్రింద కొట్టేశారన్న విషయం చటుక్కున ఇప్పుడేతెలియాలి.... ఇందులో ఏ ఒక్కటిగాని లేదా అట్లాంటిదిగాని జరగాలి.... జరిగి తీరాలి.... వాళ్ళాఫలకం కొనడం మానేయాలి-అని ఎన్నెన్నో ఆలోచనలు సుడులై, సూరి లోలోపల తిరుగుతుండగా, ఆ వెండిఫలకంధరవిని అంతటికారూ, ఇనుప బొక్కసంలాటి మొగుడూకలావిడకూడా-కనుబొమ లేగరేసి,ఆ ఫలకాన్ని దుకాణం మనిషి చేతికి, వెనక్కు ఇచ్చేస్తున్న ఆ దృశ్యం సూరి జీవితంలో మరపురాని మనోహర దృశ్యం.

ఆ ఆరడదానివి ఆమె తాలూకు మనుషులతో, వస్తువులతో కలిపి మోసుకుని వెల్తున్న ఆ కారువేపుచూసి-ఎవరెస్టెక్కిన నార్కేలా, భక్తుడికి వరంఇస్తున్న దేవుడిలా నవ్వేసి సూర్యనారాయణ....“ఓస్ ! ఓస్ ! మహా కొనవచ్చింది ఈవిడగారు....చాలు చాల్లేవమ్మా.... ఇంటికెళ్ళి ఆ బ్రాందీఏదో సేవించి మీవారి స్నేహితుడితో నాట్యంచేసి పడి నిద్రపో” అన్నాడు.

అని ఇటువైపు తిరిగి–"హా! కృష్ణయ్యా! నీకీనాడు ఎంతటిగండం తప్పిందయ్యా స్వామీ!" అన్నాడు. అని కృష్ణుడిని దీవించాడు. మనసులో ముద్దుపెట్టుకున్నాడు. లాలించాడు. కంటతడిపెట్టుకున్నాడు. ఊపిరి పోసుకున్నాడు. పెల్లుబికే ఉత్సాహంతో ఇల్లుచేరి అప్పున్న పాలవాడికి ధీమాగా సమాధానం చెప్పాడాపూట.

ఆరునెలలతర్వాత ఒక వుదయం –

ఆఫీసుకు వెళ్తూ సూరి నాతూమల్ దుకాణం కుడివైపునవున్న షోకేసుముందు ఆగాడు.

ఆగింది అతడి గుండె.

తనకు గుడ్డితనం వచ్చిందేమోనని అటూ ఇటూ చూచాడు. బస్సులు, కార్లు, స్కూటర్లు, పోలీసులు, మనుష్యులు కనబడుతున్నారు.

కళ్ళుతెరిచి, మూసి, మూసితెరచి, మళ్లీ చూశాడు. లేదు.

ఆ కృష్ణుడున్న వెండిఫలకం అక్కడలేదు!

వేళ్లన్నీ నరికేసిన మొక్కలా ఐపోయిన సూరి కాళ్లీడ్చుకుంటూ పదడుగులువేసి–దుకాణం గుమ్మములోవున్న వాచ్‌మన్‌ని అడిగాడు.

ఏదీ! ఆ కృష్ణుడేడీ? ఆ వెండిఫలకం ఏదీ!

"దానిని నిన్నరాత్రి బిలోనాదేశపు రాయబారి కొనుక్కువెళ్లాడు.

అని చెప్పాడు వాచ్‌మన్.

ఆ క్షణం చచ్చిపొయ్యాడు సూరి.

మళ్లీ బ్రతికిన సూరి కలలుకూడా కనడం మరిచిపోయిన మనిషి! లేదా శవము!

('సైనిక సమాచార్' అక్టోబర్ '67)